## ఆరోగ్య పరిరక్షణతోనే.. సమర్థవంతమైన విధి నిర్వహణ

ఎస్‌పి డాక్టర్ జి.జానకీ షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** క్రమశిక్షణ, ఫిట్‌నెస్ అనేవి పోలీస్ శాఖకు మూలాధారాలని, విధి నిర్వహణ ఎంత ముఖ్యమో సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ పేర్కొన్నారు. శనివారం, నిర్మల్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వీక్లీ పరేడ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్డ్ డ్రిల్ స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనలను ఎస్పీ స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వీక్లీ పరేడ్ వల్ల సిబ్బంఆదికి శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని, తద్వారా మంచి శక్తి సామార్థ్యాలతో ఏలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించవచ్చని సూచించారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనులపై పలు సూచనలు చేస్తూ వ్యక్తిగత ఆరోగ్య లేదా విధులకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారులక దృష్టికి తీసుకురావాలని ఎస్పీ కోరారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించయి పోలీస్‌శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిసే సహించేది లేదని హెచ్చరించారు. సిబ్బంది రెగ్యులర్‌గా హెల్త్ చెకప్స్ చేయించుకోవాలని, వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని , వ్యామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని ఆకాంక్షించారు. ఎస్పీతో పాటు నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, రిజర్వ్డ్ ఇన్స్‌పెక్టర్ రాం నిరంజన్ రావు, శేఖర్ మరియు పలువురు ఎస్.ఐ.లు ఆర్.ఎస్.ఐ.లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ చట్టాలపై ప్రత్యేక అవగాహన

మెదక్ రూరల్ సిఐ కృష్ణమూర్తి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రజల్లో సామాజిక బాధ్యతతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ కళాబృందాల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించినట్లు మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రాత్రి మండల పరిదిలోని గాంధిరిపల్లిలో మేలు కోలుపు పోలీసు కళా బృందం ద్వార సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం, బాల్య వివాహాల వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దనిహెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ఆర్థిక నష్టాలకు దారి తీసే ప్రమాదం ఉందన్నారు. మత్తు పదార్థాల బారిన పడకుండా యువత తమ భవిష్యత్తు పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోపాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పోలీస్ సిబ్బంది, కళాబృందాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆర్జీలపై నిర్లక్ష్యం సహించేది లేదు

కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ప్రజల నుంచి వచ్చే అన్ని రకాల రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమక్ష సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదా భైనామా ప్రజావాణి ఆర్జీలు, పౌర సేవల ధృవీకరణ పత్రాల జారీ పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రజల నుంచి అందుతున్న ఆర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా భూ భారతి ప్రజావాణి, సాదా భైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం 60 రోజుల గడువు నిర్దేశించిందని, ఈ గడువులోపే ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పౌర సేవల కింద జారీ చేసి కులం, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలతో పాటు కళ్యాణలక్ష్మీ , షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హులైన వారికి వెంటనే ఆమోదం తెలపాలని తహసిల్దార్లకు స్పష్టం చేశారు. దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితి ఏర్పడితే, సంబంధిత కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చరన్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డి.ఆర్.ఓ. రాథోడ్ రమేష్, ఆర్డీ దేవి దాస్, తహసిల్దార్లు ఇతర రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**ప్రజాపక్షం/రేగోడు:** రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి డిఎం రాజు శనివారం అన్నారు రేగోడ్ లో సిఎస్‌సి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అమలు అవుతాయని అన్నారు జిల్లాలోని సీఎస్సి కేంద్రాల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు సిఎస్‌సి కేంద్రాల ద్వారా జీరో అకౌంట్ పీఎం కిసాన్ డబ్బు జమ చేయడం జరుగుతుందని అన్నారు దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఎం రాజు అన్నారు. మీసేవ నిర్వాహకులు గోవింద్ జెన్ తదితరులు పాల్గొన్నారు.



# స్త్రీ నిధి రుణాల చెల్లింపులో అక్రమాలకు చెక్

- ఆన్‌లైన్ పేమెంట్లపై అవగాహన వేగవంతం చేసిన అధికారులు
- పిఒఎస్ మిషన్ల ద్వారా నగదు రహితంగా సులభంగా చెల్లింపులు
- విఒఎల నిర్లక్ష్యంపై నిఘా.. అక్రమాలకు, నగదు దుర్వినియోగానికి శాశ్వత బ్రేక్
- నేరుగా బ్యాంకు ఖాతాలకే సొమ్ము జమ అయ్యేలా నూతన పారదర్శక విధానం




**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో స్త్రీనిధి, రుణాల పంపిణీ, రికవరీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అందిస్తున్న ఈ రుణాలు జిల్లా వ్యాప్తంగా వార్షిక లక్ష్యాల కంటే ఎంతో మెరుగైన ప్రగతిని కనబరుస్తున్నాయి. తాజాగా విడుదలైన మండలాల వారి అధికారిక గణాంకాల ప్రకారం జిల్లా సగటు రికవరీ రేటు 84.86 % గా నమోదైంది. అయితే, క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కూడా ఈ పథకానికి శాపంగా మారుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా వీఓఏ ల నిరంతర నిర్లక్ష్యం భాధ్యతారాహిత్యం కారణంగానే కొన్ని గ్రామాల్లో మహిళా సంఘాల ప్రతినిధులు అక్రమాలకు పాల్పడే అవకాశం లభిస్తోంది. వీఓఏల పర్యవేక్షణ లోపించడం వల్లే సంఘాల ప్రతినిధులు డబ్బులు దుర్వినియోగం చేస్తూ సొంత అవసరాలకు వాడుకుంటున్నా సకాలంలో గుర్తించలేకపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ లోపాల వల్లే రికవరీ రేటు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ వివాదాల వల్ల స్త్రీనిధి పథకం ఉనికికే ముప్పు వాటిల్లే విధంగా ప్రచారం జరుగుతుండటంతో ఇప్పుడు అధికారులు డిజిటల్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం జిల్లా పరిధిలో మొత్తం 57476 మంది రుణాలు పొందిన సభ్యులు ఉండగా, వారికి మొత్తం రూ. 50,94,42,031 ల రుణాలు పంపిణీ అయ్యాయి. వీరికి విధించిన మొత్తం డిమాండ్ రూ. 1.,37. 24. 67.714 కాగా అందులో రూ. 1.16.46.50.089 వసూళ్ళు జరిగాయి. ప్రస్తుతం జిల్లాలో ఇంకా రూ. 20,78,17,675 బకాయలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. మండలాల వారిగా పరిశీలిస్తే దిలావర్‌పూర్ 98.31% రికవరీతో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచి ఆదర్శంగా నిలవగా, లోహెస్రా 98.21% రికవరీతో రెండో స్థానంలో నిలిచింది. అలాగే స్వశక్తి 95.60% రికవరీ సాధించి మూడో స్థానాన్ని దక్కించుకోగా నిర్మల్ రూరల్ 94.33% తో తో నాలుగు , బాసర 92.33 % తో ఐదో స్థానంలో నిలిచాయి. వీటితో పాటు మామడబ 91.34% లక్ష్మణచాంద 89.58% మరియు భైంసా 88.42% రికవరీని సాధించాయి. కుంటాల 87.10 % కుబీర్ 83.98 నర్సాపూర్ఃజి 81.66% కడెం పెద్దూర్ 74.86 రికవరీ నమోదు చేశాయి.దస్తూరాబాద్ 73.51% సోన్ 73.57% మరియు సోన్ 73.37% రికవరీ సాధించాయి. తానూర్ 69.17% రికవరీ మాత్రమే సాధించగలిగింది. మరోవైపు అధికారుల మరియు వీఓఏల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్న ఖానాపూర్ అత్యంత వెనకబడి కేవలం 53.67% రికవరీతో జిల్లాలోనే ఆఖరి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఏకంగా రూ.2.33. 30. 695 బకాయిలు పేరుకుపోగా, పెంబి 56.86% రికవరీతో ఆఖరి నుంచి రెండో స్థానంలో నిలి చి నిరాశ పరిచింది. నవయుగ పట్టణ సమాఖ్య కూడా 68.77% రికవరీ మాత్రమే నమోదు చేయగలిగింది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు పరపతి కల్పించడంలో నిర్మల్ జిల్లా అగ్రగామిగా నిలిచింది. జిల్లాకు కేటాయించిన మొత్తం క్రెడిట్ ప్లాన్ లక్ష్యం 10,649,39 లక్షలు కాగా, అధికారులు సంఘాల సమన్వయంతో 11,536,02 లక్షలను పంపిణీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 108.33% సాధన నమోదైంది. ఈ భారీ ప్రక్రియలో జిల్లాలోని 11,047 స్వయం సహాయక సంఘాలు, ఎస్.హెచ్.జి.ఎస్ వాటిలోని 87,114 మంది సభ్యులు భాగస్వాములుగా ఉన్నారు. జిల్లాలోనే అత్యంత ప్రతిభ కనబరిచిన మండలాల్లో లోహెస్రా ప్రత్యేకంగా నిలిచింది. ఈ మండలానికి కేటాయించిన క్రెడిట్ ప్లాన్ లక్ష్యం 941,17 లక్షలు కాగా, 1.295.11 లక్షల రుణాలు పంపిణీ చేసి 137.61% సాధనతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అంతేకాకుండా ఇక్కడ రికవరీ రేటు కూడా 98.61% గా అత్యం బలంగా కొనసాగుతుండటం విశేషం . ఇక్కడ 864 స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 8085 మంది సభ్యులు ఉన్నారు. వెనుకబడిన మండలాల్లో ఇకనైన విఓఏల నిర్లక్ష్యానికి స్వస్తి పలికి బకాయిల వసూళ్ళను వేగవంతం చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని మరియు పీఓఎస్ మిషన్లను అధికారులు విస్తృతంగా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అవినీతికి పాల్పడిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా కఠిన చర్యలు, జైలు శిక్షలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## రూ.30 లక్షలతో.. గోదాముల నిర్మాణం

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెల్లడి



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మం డల పరిధిలోని రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు, రైతులు పడుతున్న ఇబ్బందులను దూరం చేయడానికి ప్రభుత్వం రూ.30 లక్షల నిధులను మం జూరు చేసింది. మండలంలోని ఐగ్రామా ల్లో నూతనంగా గోదాములు (నిల్వకేంద్రాల) నిర్మాణానికి కేటాయించినట్లు ముథోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ధర్మోరా, పిప్రీ, అబ్దుల్లాపూర్, కన్నాపూర్ మరియు నరసింహానగర్ తండా గ్రామాలలో ఈ గోదాములను నిర్మించనున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో నిల్వ చేసుకునే వసతి లేక రైతాంగం దళారులను ఆశ్రయించి నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ఈ నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ గోదాముల నిర్మాణం పూర్తయితే స్థానికంగానే పంటలను భద్రపర్చుకునే వెసులుబాటు రైతులకు కలుగుతుందని, సకాలంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల మండల రైతాంగం హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యున్నత వైద్యం

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ కలెక్టరేట్ :** జిల్లాలోని పేద ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా క లెక్టర్ భవేశ్‌మిశ్రా ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్ర భుత్వ సాధారణ ఆసుపత్రిని అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆయన ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతీ విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందిచాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవలందించడంలో ఏలాంటి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రతీ రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని, అలాగే ఆసుపత్రి ప్రాంగాణాన్ని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. క్రిటికల్ కేర్ విభాగాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్‌సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

## 438మంది ప్రతిభావంతులకు సైకిళ్లు పంపిణీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/ పటాన్‌చెరు :** పటాన్‌చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి 438 ప్రతిభావంతులకు మైత్రి మైదానంలో సైకిళ్లు పంపిణి చేశారు. పటాన్‌చెరు నియోజవకర్గ చరిత్రలో మొట్టమొదటి సారిగా 202526 విద్యా సంవత్సరపు పదో తరగతి ఫలితాలోల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 ప్రతిభావంతులకు ఎమ్మెల్యే 35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్లు పంపిణి చేశారు. గురించి వివరాలు నిర్వహణ శనివారం ఉదయం మైత్రి మైదానంలో ఘనంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని 46 ప్రభుత్వ పాఠశాలలు ,89 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పరిధిలోకి వస్తున్నారు. బహుమతి ఎమ్మెల్యే స్వంత సంస్థాగత నిధుల ద్వారా సైకిళ్లు కొనుగోలు చేసి సాదికారుల చేతుల ద్వారా విద్యార్థులకు అందజేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాదనలో మరిన్ని ప్రేరణలు కల్పిస్తామని తెలిపారు.ప్రతిభ గల విద్యార్థుల భవిష్యతు విద్యాబ్యాసానికి దీన్ని బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మానసిక శిక్షణ పరీక్షా సామాగ్రి పంపిణి చేస్తున్నామని ఈ సంవత్సరం నుంచి ప్రత్యేకంగా సైకిళ్లు పంఫిణి చేయడం నిర్ణయించామని చెప్పారు. విద్యారంగాభివృద్దికి సంబందించి వ్యాఖ్యలు ఎమ్మెల్యే తెలియజేశారు. పదో తరగతి జీవితం మలుపు తిప్పి కీలక దశ పలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి పునాది లక్ష్యాన్ని నిర్ణయించి కష్టపడి చదువుకుంటే సాదించవచ్చునన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సమాజం ఎదుగుదలకు ప్రోత్సహించాల్సిన బాద్యతగా ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిదులు మాజీ ప్రజాప్రతినిదులు, మండల విద్యాశాఖాదికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ,కరస్పాండెంట్లు ,సీనియర్ నా యకులు ప్రజాశాఖలు పాల్గొన్నారు. సంగ్రహంగా పటాన్చెరు నియోజకవర్గంలో విద్యార్థుల కోసం ప్రత్యేక మార్గదర్శకత్వంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేపట్టిన 35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం విద్యారంగ అభివృద్ధిక కొత్త చైతన్యం నింపిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాధికారి డి. మాధవి, ఏడీ వేణుగోపాల్ గౌడ్‌లకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, తొమ్మిది నెలల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ప్రారంభించే అల్పాహార పథకం నిర్వహణను స్థానిక వంట కార్మికులకే అప్పగించాలని, ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ. 10,000 గౌరవ వేతనం హామీని అమలు చేయాలని, కోడిగుడ్లు, గ్యాస్, సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మెస్ చార్జీలను రూ.25కు పెంచి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, బకాయిలను తక్షణమే చెల్లించాలని స్పష్టం చేశారు.



## రైతును ఏడిపించిన ప్రభుత్వం మనుగడ సాగించలేదుః కెటిఆర్



**ప్రజాపక్షం/నేరడిగొండః** రైతును కష్టపెట్టే ప్రభుత్వాలు ముందరపడ్డ సందర్భాలు చరిత్రలో లేవని, అన్నదాతను ఏడిపించిన ఏ రాజ్యమూ బాగుపడలేదని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. గతవారం జొన్నల కళ్లంలోనే ఆత్మహత్య చేసుకున్న పోన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ్ కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ తరపున రూ. 3 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేసి ధైర్యం చెప్పారు.బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో రూ. లక్ష కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేసి పెట్టుబడి సాయం అందించామన్నారు. ప్రస్తుత పాలనలో రైతు పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విధించిన పరిమితుల మేరకే పంటలు కొనుగోలు చేస్తామని, ఎక్కువ పండిస్తే కొనబోమని ముఖ్యమంత్రి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పరిపాలన చేతకాక, ప్రజలను తన దోపిడీ నుంచి పక్కదారి పట్టించడానికి సీఎం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందే కేసిఆర్ చెప్పిన 'మోసపోతే గోసపడతాం' అనే మాట ఇప్పుడు నిజమైందన్నారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, జీవన్ రెడ్డి, నాయకులు జాన్సన్ నాయక్, మండల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి, మధ్యాహ్నం 1.30 తర్వాత లోనికి అనుమతుండదు

అధికారులతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 21న ఆదివారం జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చే శామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. నీట్ పరీక్ష పునఃనిర్వహణ ఏర్పాట్లపై శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 3456 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఈ మేరకు జిల్లా కేంద్రంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నాగారంలోని మైనార్టీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల/కళాశాల, బోధన్ పట్టణంలో రైల్వే గేటు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిచ్‌పల్లిలోని టియు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల బిల్డింగ్, మాక్లూర్‌లోని బిగాల కృష్ణమూర్తి జడ్పీహెచ్ఎస్‌లలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి కనీసం అరగంట ముందే లోనికి చేరుకోవల్సి ఉన్నందున నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి 1.30 గంటల వరకు అనుమతినిస్తారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలు అమర్చామని, పకడ్బంధీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. కాగా నీట్ పరీక్ష రోజున అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఉండే అవకాశమున్నందున విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ చర్యలు చేపట్టాలని అదనపు డీసీపీ శుభం నగ్రాలేకు సూచించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశ్నపత్రం, సమాధాన పత్రాల తరలింపునకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 164 నిషేధాజ్ఞలు అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష సమయాలకనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల నోడల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

